2) శంకరాభరణం

ప|| చేపట్టి మమ్ము గావు శ్రీనరసింహా నీ- | శ్రీపాదములే దిక్కు శ్రీనరసింహా ||

చ|| చెలగువేయిచేతుల శ్రీనరసింహా | చిలికేటినగవులశ్రీనరసింహా |
సిలుగులేనిమంచి శ్రీనరసింహా | చెలి దొడెక్కించుకొన్న శ్రీనరసింహా ||

చ|| క్షీరసముద్రమువంటి శ్రీనరసింహా దైత్య | జీరినవజ్రపుగోళ్ళ శ్రీనరసింహా |
చేరి ప్రహ్లాదునిమెచ్చే శ్రీనరసింహా నుతిం- | చేరు దేవతలు నిన్ను శ్రీనరసింహా ||

చ|| శ్రీవనితతో మెలగు శ్రీనరసింహా | చేవదీరె నీమహిమ శ్రీనరసింహా |
శ్రీవేంకటాద్రిమీది శ్రీనరసింహా సర్వ- | జీవదయాపరుడ వో శ్రీనరసింహా ||